JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 23-11-2025
Medchal - Malkajgiri | Sunday 23-11-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 177 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 177 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## శ్రీ సత్యసాయి సేవలు చిరస్మరణీయం




జయభేరి, పుట్టపర్తి, నవంబర్ 22 :

శ్రీ సత్యసాయి బాబా నిరంతరం బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి మార్గాలు అనుసరణీయమని, లోక కల్యాణం కోసమే ఆయన పాటుపడ్డారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో కలిసి ఆమె సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు విమానాశ్రయంలో రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. "సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా భాగ్యం. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన మహానుభావుల్లో ఆయన అగ్రగణ్యులు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ జాతి నిర్మాణం కోసం విశేష కృషి చేస్తోంది. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. 1969 నుంచే మహిళా సంక్షేమానికి బాబా ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "'లవ్ ఆల్.. సర్వ్ ఆల్' అనేదే బాబా సిద్ధాంతమని, ఆయన ప్రవచించిన పంచ సూత్రాలు పాటిస్తే ప్రపంచం శాంతితో వర్ధిల్లుతుందని అన్నారు. "సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టడానికైనా ఆయన సిద్ధపడ్డారు. ఆయన స్ఫూర్తితో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలిచ్చి ఆ ప్రాజెక్టులను పూర్తి చేశారు" అని గుర్తుచేసుకున్నారు. సత్యసాయి ట్రస్ట్ 140 దేశాల్లో 2 వేలకు పైగా శాఖలతో, 7.50 లక్షల మంది వాలంటీర్లతో సేవలందించడం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం'ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# అందెశ్రీ కీర్తి తెలంగాణ చరిత్రలో శాశ్వతం

**వజ్రాల గురించి దశాబ్దాలు, శతాబ్దాలు చర్చించినా కోహినూర్ వజ్రానికి పోటీ లేనట్టే.. కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా, ఎవరి గురించి చర్చించినా రేపటి తెలంగాణ చరిత్రలో అందెశ్రీ మొదటి స్థానంలో నిలబడుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందెశ్రీ కీర్తిని తెలంగాణ చరిత్రలో శాశ్వతం చేయడంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ సంతాప సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.**

జయభేరి, హైదరాబాద్ :

వజ్రాల గురించి దశాబ్దాలు, శతాబ్దాలు చర్చించినా కోహినూర్ వజ్రానికి పోటీ లేనట్టే.. కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా, ఎవరి గురించి చర్చించినా రేపటి తెలంగాణ చరిత్రలో అందెశ్రీ మొదటి స్థానంలో నిలబడుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందెశ్రీ కీర్తిని తెలంగాణ చరిత్రలో శాశ్వతం చేయడంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ సంతాప సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.
జీవితంలో బడి ముఖమే చూడని సహజకవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ.. గీతం ఈరోజు ప్రతి బడిలో పాడుకునేంతగా యావత్ తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిన గొప్ప కవి అని కొనియాడారు.
"బడికి వెళ్లని, బడి ముఖమే చూడని అందెశ్రీ అన్న జయ జయహే తెలంగాణ.. అంటూ ముక్కోటి గొంతుకలను ఏకం చేసి ఈ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపితేనే రాష్ట్ర కల నిజమైంది. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలే కాదు. ప్రపంచంలోని ప్రతి మూలన ఉన్న గుండెకు జయ జయహే తెలంగాణ.. చేర్చి ఒక ఉద్యమ స్ఫూర్తిని నింపిన గొప్ప తెలంగాణ బిడ్డ అందెశ్రీ. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు పాడుకున్నది. కోరుకున్నదే.. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా చదువు చెప్పే ప్రతి పుస్తకంలో రాయాలని ప్రజా ప్రభుత్వం ఆ గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో మొదటి అంశంగా చేర్చాం. బాధతో

...మిగతాది 2 లో



అక్షర వాహినితో
"నిప్పుల వాగు"ను పారించి..
మాయమైపోతున్న మనిషిని మనిషికి
తిరిగి పరిచయం చేసి..
తెలంగాణ అస్తిత్వ పోరులో ఊరూరా
"జయ జయహే తెలంగాణ"
గళమై వినిపించి..
అణిచి వేతపై, నియంతృత్వ పాలనపై
నిరసన గళాన్ని ఎక్కు పెట్టి..
చివరి ఊపిరి వరకు అండగా నిలిచిన
నా ఆప్తుడు అందెశ్రీ..
నా చివరి ఊపిరి వరకు యాదిలో
మెదులుతూనే ఉంటాడు..

## పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 2.80 లక్షల కోట్ల అప్పులు




- 23 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల 30 వేల కోట్ల అప్పులు
- అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలకు చెప్పాలి : కెటిఆర్

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 22 :

బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పుల మధ్య ఉన్న తేడాను కెటిఆర్ వివరించారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రతి పైసా ద్వారా ఆస్తులను సృష్టిస్తే ఈ ప్రభుత్వం మాత్రం అప్పుల సునామిని సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ లెక్కల ప్రకారం పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 2.80 లక్షల కోట్ల అప్పులు తీసుకువస్తే, 23 నెలల కాలంలోనే దాదాపు రెండు లక్షల 30 వేల కోట్ల అప్పులను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని అన్నారు. ఆనాడు మిషన్ భగీరథ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి మిషన్ కాకతీయ వేలకోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం వంటి అనేక

...మిగతాది 2 లో



## ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి

- సత్యసాయి సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుంది
- సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషం

జయభేరి, పుట్టపర్తి:

సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి... ఎవ్వరిని నొప్పించకూడదు అనేది శ్రీ సత్యసాయిబాబా సిద్ధాంతం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనేది సత్యసాయి బాబా ప్రవచించిన ఐదు సూత్రాలు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందని అన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రజలకు తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారు. సత్యసాయి

...మిగతాది 2 లో

## ఆ విధానాలు పూర్తిగా మార్చాలి

- జీ20 సమ్మిట్‌లో ప్రధాని మోదీ కీలక ప్రతిపాదనలు
- సాంప్రదాయ జీవన విధానాలు
- ఆఫ్రికా యువతకు నైపుణ్య శిక్షణ
- డ్రగ్స్-టెర్రర్ సంబంధాన్ని అడ్డుకోవడం




జయభేరి, న్యూఢిల్లీ:

ఆఫ్రికాలో తొలిసారిగా జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ అభివృద్ధి పద్ధతులను లోతుగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న అభివృద్ధి విధానాలు ప్రకృతిని నాశనం చేస్తున్నాయని, ఆఫ్రికాలో సవాళ్లు ఎక్కువగా ఉన్నాయని మోదీ అన్నారు. ఎవరినీ వెనుకబడి ఉంచకుండా, అందరినీ కలుపుకొనిపోయే అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి

...మిగతాది 2 లో

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ


- లొంగిపోయిన 37 మంది



- జయభేరి, హైదరాబాద్, నవంబర్ 22:

మావోయిస్టులు తెలంగాణలో మరో తీవ్రమైన ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి ముందు మొత్తం 37 మంది మావోయిస్టులు శనివారం లొంగుబాటు చేశారు. వీరిలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేష్ వంటి కీలక నేతలు కూడా ఉన్నారు. మావోయిస్టు పార్టీ ప్రభావం తగ్గుతోందని, జనజీవన స్రవంతిలో కలిసిపోవాలనే భావన పెరుగుతోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ లొంగుబాటు జరిగింది. 37 మందిలో 25మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. వీరు అజాద్, అప్పాసి నారాయణ (రమేష్) వంటి స్టేట్ కమిటీ నేతలు, అలాగే ఏవోబీ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించినవారు. ఆజాద్‌కు మావోయిస్టు పార్టీలో 25 సంవత్సరాల అనుభవం ఉంది. అతను ఏవోబీ ప్రాంతంలో ఆయుధాలు, రిక్రూట్‌మెంట్, ప్రచార విభాగాల్లో ముఖ్య బాధ్యతలు నిర్వహించాడు. రమేష్ కూడా స్టేట్ కమిటీలో కీలక సభ్యుడిగా పనిచేశాడు. పోలీసులు

...మిగతాది 2 లో



## గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు

- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఈ ఎన్నికలు
- పాత పద్ధతిలోనే జీవో విడుదల, బీసీల మాటేంటి

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 22 :

గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేస్తూ శనివారం జీవో రిలీజ్ చేసింది. దాంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది అధికారికంగా అమలు చేయడం సాధ్యం కాదని తేల్చింది. తెలంగాణ

...మిగతాది 2 లో



## రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- నక్కపల్లిలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ప్రారంభించిన హోం మంత్రి అనిత

జయభేరి, అనకాపల్లి :

నక్కపల్లిలో అండర్-19 రాష్ట్ర స్థాయి బాలబాలికల హాకీ చాంపియన్షిప్ పోటీలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విద్యార్థులు హాజరయ్యారు. మూడు రోజులపాటు బాల, బాలికల జట్ల మధ్య ఆసక్తికర పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం మంత్రి అనిత విద్యార్థులను పరిచయం చేసుకుని వారి గౌరవ వందనం

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## అందెశ్రీ కీర్తి తెలంగాణలో శాశ్వతం

ఉద్వేగంతో ఈ మాట చెబుతున్నా. ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన జయ జయహే తెలంగాణ... స్వరాష్ట్రం సాకారమైన తర్వాత ఆ గీతం రాష్ట్రీయ గీతంగా అధికారిక హోదా లభిస్తుందని 4 కోట్ల ప్రజలు ఆశించారు. తెలంగాణ ఉద్యమం ఎవరు చేశారంటే అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న, ఒక జయరాజ్ చేశారన్న చర్చ వస్తుందని గత పాలకుల హయాంలో ఆ గీతం మూగబోయింది. పెన్నే కదా అని మన్నుకప్పితే గన్నులై మొలకెత్తుతాయి.. గన్నులై గడీలే కుప్పకూలుతయన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్రకు సంబంధించిన సమైక్య వాదులు ఈ తెలంగాణపై ఆధిపత్యం చెలాయిస్తున్నప్పుడు గద్దరన్న, గూడ అంజన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న.. వారి ఆధిపత్యానికి చెరమగీతం పాడాల్సిందేనని, తెలంగాణకు విముక్తి కల్పించాల్సిందేనని మలి దశ ఉద్యమానికి పునాదులు వేశారు. రాచరికం హద్దు దాటినప్పుడు, తెలంగాణ నేలను చెరబట్టాలని, ఈ నేలపై ఆధిపత్యం చెలాయించాలని అనుకున్నప్పుడల్లా ఈ గడ్డపై పుట్టిన కవులు, కళాకారులు, తమ దుప్పటి దుమ్ము దులిపి దిగంతాలకు తరిమిన చరిత్ర ఈ నేలకు ఉంది. సర్వం త్యాగం చేసి ఏమీ ఆశించకుండా, ఆలోచించకుండా 5 దశాబ్దాల పని చేసిన ఆ కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. గద్దర్, అందెశ్రీ, ఈ ప్రజా పాలన కోసం శాయశక్తులా పనిచేశారు. వారి పోరాట స్ఫూర్తిని మేము ఎవరూ మరిచిపోలేనిది. అందెశ్రీ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వడంతో పాటు స్మృతివనం కట్టాలనుకున్నాం. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకాన్ని ప్రతి లైబ్రరీలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో కూడా వారి కుటుంబాన్ని ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న తరుణంలో 9 మంది ఉద్యమ కారులు, కవులు, కళాకారులను సన్మానించుకోవడమే కాకుండా వారికి 300 గజాల ఇంటి స్థలాన్ని కూడా కేటాయించాం. వారు ఆత్మగౌరవంతో బతకేలా భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి ఇండ్లు కట్టించే కార్యక్రమాన్ని కూడా తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహకి సూచిస్తున్నా. అందెశ్రీ పేరిట జానపద విశ్వవిద్యాలయంతో పాటు సభలో వక్తలు చేసిన సూచనలపైన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన నిర్ణయం తీసుకుంటాం.. నాకు అత్యంత ఆప్తుడు. మనసుకు చాలా దగ్గరివాడు. అందెశ్రీ యాదిలో ఈ సంస్మరణ సభ ఏర్పాటు చేసిన వారికి మనస్ఫూర్తిగా అభినందనలు.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## 2.80 లక్షల కోట్ల అప్పులు

ఉత్పాదక ఆస్తులను సృష్టించిందని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకం లేకుండానే, ఒక్క ప్రాజెక్టు ప్రారంభం కూడా చేయకుండానే, కనీసం మౌలిక వసతుల కోసం ఒక్క ఇటుక పేర్చకుండానే రెండు లక్షల 30 వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువచ్చి ఏం చేసిందని ప్రశ్నించారు. అక్టోబర్ నెల కోసం విడుదల చేసిన కాగ్ నివేదికతో వడ్డీల వాదనలో డొల్లతనం బయటపడటంతో, ఇంత భారీ మొత్తంలో చేస్తున్న అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. వడ్డీల పేరుతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వాస్తవానికి ఈ అప్పులన్నింటినీ తమ అనుచరులు, మధ్యవర్తులు, ఢిల్లీకి మూటలను పంపడానికే ఉపయోగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 'స్కాంగ్రెస్ ఎటిఎం' గా మార్చారని విమర్శించారు. ఇన్ని రోజులు వడ్డీల కోసమే అప్పులు చేస్తున్నామని కాంగ్రెస్ వాళ్ళు చెప్పుకొచ్చినా, కాగ్ నివేదికతో మరోసారి వాదనలోని డొల్లతనం బట్టబయలైనందున, ఈ అప్పులన్నీ దేని కోసం చేశారో వెంటనే ప్రజలకు వివరించాలని అన్నారు.

## ఎన్నికల రిజర్వేషన్లు

హైకోర్టు రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెలలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని తెలిసిందే. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లపై ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిమితి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్లలో రొటేషన్ పద్ధతిలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా రిజర్వేషన్ల ప్రక్రియలో పారదర్శకత మరియు సమాన అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మార్పులన్నీ కమిషన్ నివేదిక ఆధారంగా రూపు దాల్చనున్నాయి.తెలంగాణలో పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల (నవంబర్) 26 లేదా 27వ తేదీన ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీలకు సంబంధించిన ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ కావడంతో, ఈ ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం వచ్చింది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల వివాదం (బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు అంశం) కారణంగానే ఇప్పటివరకు ఈ ఎన్నికలు ఆలస్యం అవుతూ వచ్చాయి.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికలు డిసెంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ దశలో 4,000కు పైగా గ్రామ పంచాయతీలు, 100 ఎంపీటీసీలు (MPTCs) కవర్ అవుతాయి. ఆ తరువాత, రెండవ దశ ఎన్నికలు డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో మరో 4,000 పంచాయతీలకు పోలింగ్ జరుగుతుంది. ఇక మూడవ, చివరి దశ ఎన్నికలు డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో మిగిలిన 4,769 పంచాయతీల ఎన్నికలను పూర్తి చేస్తారు. మొత్తంగా రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు డిసెంబర్ లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో సుమారు 1.67 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో లక్షకు పైగా అభ్యర్థులు పోటీ పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి

బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చారు. ఇప్పటికే అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడాన్ని నాకు సంతోషాన్నిస్తోంది. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారికి బాబా ట్రస్టు ఆదుకుంటోంది. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్ట్ అమలు చేసి చూపిస్తోందని అన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారు. 7.50 లక్షల వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్ట్ ద్వారా సేవలందించారు... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారు. ధనవంతులు... పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్ లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయి. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలి. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపితం చేసేలా కృషి చేయాలి. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు.


## క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

స్వీకరించారు. విద్యార్థుల ఆకర్షణీయ నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఆటలు జీవితంలో ఒక ముఖ్య భాగమని మంత్రి అనిత పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో కొంతమంది తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెడతున్నారని, మార్కులు ముఖ్యంకాదని, క్రీడలు ముఖ్యం అని ఆమె స్పష్టం చేశారు. ఉమెన్ క్రికెట్కు పెరుగుతున్న గుర్తింపును ప్రశంసిస్తూ, బాలికలకు క్రికెటర్ చరణ్ శ్రీ ఆదర్శమని పేర్కొన్నారు. నక్కపల్లిలోనే 40-50 మంది హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే క్రీడలను ప్రోత్సహించడంలో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలను ఆమె అభినందించారు. ఆటల్లో గెలుపు-ఓటములు సహజమని, క్రీడల్లో పాల్గొనే ప్రతీ ఒక్కరూ విజేతలే అని అన్నారు. Ncc, Nss కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. త్వరలో నక్కపల్లిలో హాకీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు.

# నాయకులకు నాలుకెట్ల మింగుడు పడుతుందో..

**కులం పేరుతో ఆర్థికంగా బలపడుతున్న కేటుగాళ్లు... మతాల పేరుతో మాయమవుతున్న మానవత్వాలు... ఎవడో సెలబ్రిటీ వానికోసం నువ్వు నీ కుటుంబాన్ని విడిచి పిచ్చోడు మాదిరిగా డబ్బులు ఖర్చు చేసుకోవాలా? నువ్వు కాదా సెలబ్రిటీ? నీకెందుకు ఆలోచన రాదు..? యువత మేలుకో.. ఈ దేశం ఏలుకో.. అన్న స్వామి వివేకానంద స్ఫూర్తిని ఎందుకు మరుస్తున్నారు..? ఫాలోవర్ గా ఉండకండి.. నాయకులుగా మారండి..**

జయభేరి, హైదరాబాద్ :



సమాజం కోసం జీవితాన్ని దారపోస్తున్నామంటూ ఆయా కుల సంఘాల లోని కొంతమంది నాయకులకు చురుకు తలగొచ్చు. కానీ ఇది వాస్తవం కాదా? ఒకసారి ఆలోచించండి.. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏళ్ళు దగ్గర పడుతున్న ఇంకా కులం అని పట్టుకొని తిరిగే ఈ సన్నాసులను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమర్థిస్తారా..!? అంబేద్కర్ గారి పేరు చెప్పుకొని దళితుల జీవితాల్లో మైనర్ బాలికలను బుగ్గిపాలు చేస్తున్న నాయకులు అసలు నాయకులేనా? ఏ పని పాట లేకుండా సమాజంలో ఏదో ఒక అంశాన్ని పట్టుకొని సోషల్ మీడియాలో పనికిరాని పసలేని కాంట్రవర్సీని తెచ్చిపెట్టే వీడియోలు చేస్తూ సెలబ్రిటీలుగా మారుతున్న వాళ్లకి జీవనాధారం ఏంటి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు సమాజంలో చదువుకున్న వాళ్ళు ఆలోచించాల్సిన తరుణం ఇది...

**నిజానికి దళిత సంఘాల్లో ఎంతోమంది నాయకులు పుట్టగొడుగుల పుట్టుకొచ్చారు... ఎక్కడపడితే అక్కడ ఆధ్యాత్మిక విషయాలను సున్నితమైన విషయాలను కాంట్రవర్సీగా మాట్లాడుతూ సెలబ్రిటీలుగా మారిపోతున్నారు.. వారిని చూస్తూ అంబేద్కర్ భావజాలం ఉన్న ఇతనే మంచోడు అని అనుకొని తన ఫాలోవర్స్ గా మారే పిచ్చి జనానికి ఆ నాయకుడు అసలు స్వరూపం తెలిస్తే నిద్ర కూడా పట్టకుండా ఉండిపోతారు.... నిజానికి సమాజంలో ఎన్నో సమస్యలు మౌలిక పరమైనటువంటి విషయాలు విద్య వైద్యం సామాజిక ఆర్థిక రాజకీయ కోణంలో ఇంకా అధికారం కోసం దళితుల జీవితాలు అందకుండా వెళుతున్న ఈ సందర్భంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల పనితీరును అడ్డంపెట్టి కొన్ని సంఘాలను ఏర్పాటు చేస్తూ వాటికి కావలసినంత నిధులను సమకూర్చుకుంటూ పబ్బం గడుపుతున్న జాతి ద్రోహులను ఏమని తిట్టాలి.... పొద్దంతా కష్టించి పని చేస్తే కడుపు నిండని జీవితాలు సమాజంలో మధ్యతరగతి పేద బడుగు బలహీన వర్గాలవై తే... దర్జాగా కార్లలో తిరుగుతూ విలాసవంతమైన హోటలలో తిండిని తింటూ పబ్బం గడుపుకునే నేతలు పొద్దున లేస్తే అంబేద్కర్ పేరు చెప్పుకొని బతికే గుంట నక్కలు కాదా... ఏమీ తెలియని పేదవాళ్లు అంబేద్కర్ భావజాలాన్ని ఎవరో ఒకరు వినిపిస్తుంటే వాళ్ల ఫాలోవర్గా మారి అన్నకు జై అంటూ నినాదాలు కొడుతూ అన్న మీటింగ్ కు వస్తే లక్షల గుమ్మరించాల్సిందే అన్న విధంగా మారిపోతుంది... అన్నా అంటే ఏమనుకున్నావ్? ఆయన వచ్చి అంబేద్కర్ గురించి ఒక్క మాట మాట్లాడితే లక్షల మంది సోషల్ మీడియాలో చూస్తారు సోషల్ మీడియాలో ఆయన ఒక్క వీడియో వైరల్ గా మారిపోతుంది.**



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

అంటూ జనమే కదా వాళ్లను సెలబ్రిటీలుగా చేసింది.... అలా సెలబ్రిటీలుగా మనమే ఎందుకు మారకూడదు. అని ఏనాడు ఒక సాధారణ పౌరుడు ఆలోచించాడా..? అంబేద్కర్ గురించి మాట్లాడానికి ప్రతి ఒక్క పౌరుడు ముందుకు వస్తే ప్రతి ఒక్కరు సెలబ్రిటీలు కారా? జాతి పేరు చెప్పుకొని కుల సంఘాలను ఏర్పాటు చేసి జల్సాలుగా తిరిగేవారు జాతి ఉద్ధరణకు పాల్పడతారా? ఈ దేశం ఏమైపోతే నాకేంటి నాకెంత ఆర్థికంగా ఆదాయం దక్కుతుంది అని ఆలోచించే వారే నాయకులుగా సమాజంలో చలామణి అవుతున్నారు... జాతిని తాకట్టు పెట్టే నేతలే కులాన్ని వంచన చేసే నాయకులే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మద్దతును కూడగట్టుకుంటూ ఆర్థికంగా బలపడుతుంటే పొద్దంతా ఎండలో కష్టం చేసి పనిచేసిన బడుగు బలహీన వర్గాల వారికి సొంత ఇల్లు లేకుండా పోతుంది... తన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకునే వారుగా మిగిలిపోతున్నారు... ఏమైనా అంటే సెలబ్రిటీలు గా మారిన వారు మాకు తాతల నాటి ఆస్తులు ఉన్నాయి నేను వ్యవసాయం చేసుకుంటున్నాను నాకు రాజకీయంగా వ్యాపారాలు ఉన్నాయి. నేను వైన్స్ నడుపుకుంటున్నాను ఇలా రకరకాలుగా ఏదో ఒక కోణంలో ఆర్థిక వనరులను సాకుగా చూపిస్తారు... కులం కోసం పోరాడే వాళ్లు తమ ఉనికిని కాపాడుకునే విధంగా ఆర్థికంగా నిలబడడానికి సమాజంలో ఆ కులంలో నుంచి వచ్చిన ఆర్థిక పరమైన విషయాలలో బలమైన నాయకులకు వల విసిరేస్తారు... ఒకరు మాటల్లో ఒకరు పాటల్లో ఒకరు వ్యాఖ్యాతల్లో మరొకరు రాజకీయ కోణంలో ఇలా ఏదైతేనే అవకాశం దక్కించుకోవడానికి ఏ పనైనా మొదలు పెడతారు. నోటి నిండా విషాన్ని నింపుకొని కడుపునిండా స్వార్థాన్ని దాచుకొని పైపైకి తీయటి మాటలు చెప్పే వారే నాయకులుగా సెలబ్రిటీలుగా ఎక్కువగా కనిపిస్తున్నారు...

**ఒక సెలబ్రిటీ హీరో అభిమాని కి షేక్ హ్యాండ్ ఇస్తే తన చేయిని సబ్బుతో కడుక్కుంటార్రా అని చనిపోయిన డాన్స్ మాస్టర్ ఎన్నో విషయాలు బట్టబయలు చేశాడు... అలాగే రాజకీయ నాయకులు ఇవాళ సమాజంలో కొత్తగా నేతలుగా పుట్టుకొస్తున్న కుల మత సంఘాల సెలబ్రిటీలు..**

వీళ్ళ సమాజాన్ని ఉద్ధరించేది అంబేద్కర్ వాదాన్ని బలపరిచేది... ఆనాడు అంబేద్కర్ తాను పడ్డ కష్టాన్ని ఎవ్వరికీ వివరించాలని అనుకోలేదు.. దండేసి దండం పెట్టి గుడిగట్టి మొక్కాల్సిన అవసరం లేదని ఆయన ఆరోజే కుండ బద్దలు కొట్టినట్టు పచ్చి నిజాన్ని సమాజానికి విసిరాడు... కానీ ఈ నేతలు చేస్తున్నది ఏంటి ఈ నాయకులు మాట్లాడుతున్న విషయాలు ఏమిటి? అంబేద్కర్ దేవుడు అంబేద్కర్ లేకపోతే మనకు బతుకు లేదు ఆయన వాదాన్ని మనం ఇంకా గట్టిగా బలపరచాలి అని ఇంకా సమాజాన్ని అంబేద్కర్ కాలవనాటి పరిస్థితులకు తీసుకెళ్తున్నారు... ఇదా ఈ నాయకులు చెప్పే నీతి మాటలు? మనం చదువుకోలేదా మనకు అంబేద్కర్ గురించి తెలియదా తెలియకపోతే తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా? శ్రీశ్రీ అన్నట్టుగా ఒకే చోట కూర్చొకు వీలైతే నడువు లేదా పరుగెత్తు అన్న విషయాలను ఒకసారి ప్రతి పౌరుడు గుర్తు పెట్టుకోవాలి. అంతేకానీ సోషల్ మీడియాలో కనిపించిన ప్రతి ఒక్క నాయకుని సెలబ్రిటీలుగా ఎంచుకొని వారికి సలాం కొట్టాల్సిన అవసరం లేదు... యువత మేలుకో ఈ దేశాన్ని ఏలుకో అన్న స్వామి వివేకానంద సూక్తిని మరొకసారి గుర్తు చేస్తూ సెలబ్రిటీలు ఎవరూ కాదు నువ్వు సెలబ్రిటీ వే....

## ఆ విధానాలు పూర్తిగా మార్చాలి

ఉపయోగపడే మూడు ముఖ్యమైన కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రతిపాదించారు:

**సాంప్రదాయ జీవన విధానాలు**

పర్యావరణాన్ని కాపాడుతూ, సమాజాన్ని సమతుల్యంగా ఉంచే మన పాత జీవన విధానాలు, సాంప్రదాయ పద్ధతులను గుర్తించాలని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ జ్ఞానాన్ని సేకరించి, అందరికీ అందుబాటులో ఉంచడానికి గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపోజిటరీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ జ్ఞానం రాబోయే తరాలకు స్థిరమైన జీవన పద్ధతులను నేర్పిస్తుంది. దీనికి భారతదేశంలోని 'భారతీయ నాలెడ్జ్ సిస్టమ్స్' ఒక పునాదిగా ఉంటుందని ప్రధాని చెప్పారు.

**ఆఫ్రికా యువతకు నైపుణ్య శిక్షణ**

ఆఫ్రికా అభివృద్ధి చెందితే అది ప్రపంచం మొత్తానికీ మేలు చేస్తుందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. "G20ఆఫ్రికా మల్టిపుల్ స్కిల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించాలి. G20 దేశాలన్నీ దీనికి మద్దతు ఇవ్వాలని మోదీ సూచించారు. పది ఏళ్లలో ఆఫ్రికాలో కోటి మంది యువతకు శిక్షణ ఇవ్వడానికి 10 లక్షల మంది సర్టిఫైడ్ ట్రైనర్‌లను తయారు చేయాలి. ఇందుకోసం శిక్షకులకు శిక్షణ పద్ధతిని అమలు చేయాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.

**డ్రగ్స్-టెర్రర్ సంబంధాన్ని అడ్డుకోవడం**

ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వేగంగా వ్యాపిస్తున్నాయని, ఇవి ప్రజారోగ్యానికి, ప్రపంచ భద్రతకు పెద్ద ముప్పు అని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. "డ్రగ్స్ అమ్మకాలు, టెర్రరిజం మధ్య ఉన్న సంబంధాన్ని తెంచడానికి G20 ప్రత్యేక చొరవ తీసుకోవాలి. డ్రగ్స్ రవాణా నెట్‌వర్క్‌లను నాశనం చేయడానికి, అక్రమంగా డబ్బు చేతులు మారడాన్ని ఆపడానికి, టెర్రరిజానికి నిధులు అందకుండా చేయడానికి ఆర్థిక, భద్రతా పద్ధతులను అన్ని దేశాలు కలిసి ఉపయోగించాలి" అని మోదీ చెప్పారు. ఈ మూడు ప్రతిపాదనలు ప్రపంచం ఎదుర్కొంటున్న సుస్థిరత, అభివృద్ధి, భద్రతా సమస్యలకు సమిష్టిగా పరిష్కారం చూపడానికి G20 దేశాలను ఏకం చేసే లక్ష్యంతో మోదీ ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

ఈ లొంగుబాటు తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వివరాలు వెల్లడించారు. వీరు తీసుకొచ్చిన ఆయుధాల్లో 303 రైఫిల్, G3 రైఫిల్, SLR, AK 47 రైఫిల్‌లు, వేలాది బుల్లెట్లు, క్యార్ట్రిజ్ సీజ్‌లు ఉన్నాయి. ఈ ఆయుధాలు మావోయిస్టు ఆపరేషన్లకు ఉపయోగపడేవి. డీఈ లొంగుబాటు మావోయిస్టు పార్టీకి భారీ నష్టం. 2025లో మొత్తం 427 మంది మావోయిస్టులు లొంగిపోయారన్నారు. కొయ్యాడ సాంబయ్య (ఆజాద్) మావోయిస్టు పార్టీలో 2000ల నుంచి ఉన్నాయి. అతను ఏవోబీ ప్రాంతంలో పార్టీ సెక్రటారీగా పనిచేశాడు. ఆయుధాల పంపిణీ, క్యాడర్ రిక్రూట్‌మెంట్, ప్రచార కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాడు. పోలీసుల పటిష్ఠమైన ఆపరేషన్లు, ఆరోగ్య సమస్యలు, పార్టీలో అంతర్గత విభేదాలు కారణంగా ఆజాద్ లొంగిపోవాలని నిర్ణయించుకున్నాడు కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని సంకల్పించింది. ఈ దిశగా 'ఆపరేషన్ కగార్' ప్రారంభమైంది. తెలంగాణ పోలీసులు ఈ ఆపరేషన్‌లో భాగంగా పటిష్ఠమైన ఇంటెలిజెన్స్, పాలసీని అమలు చేస్తున్నారు. 2025లో ఇప్పటికే 427 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

ఈ లొంగుబాటు మావోయిస్టు ఐడియాలజీ ఇక ఉనికిలో ఉండదని, క్యాడర్లు మెయిన్‌స్ట్రీమ్‌లో చేరాలనే భావన పెరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ 37 మంది మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వ రిహాబిలిటేషన్ పాలసీ ప్రకారం సహాయం అందిస్తున్నారు. ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, వైద్య సౌకర్యాలు కల్పిస్తారు. మావోయిస్టు పార్టీలో అంతర్గత విభేదాలు, ఆరోగ్య సమస్యలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగా మరిన్ని లొంగుబాట్లు ఉంటాయని డీజీపీ తెలిపారు. అనారోగ్యంతో పాటు మారిన పరిస్థితులతో తాము జనజీవన స్రవంతిలో కలవాలనుకున్నట్లుగా లొంగిపోయిన మావోయిస్టులు ప్రకటించారు. కేంద్ర కమిటీలో ఇంకా ఇద్దరు ఉన్నారని వారు కూడా లొంగిపోవాలని సలహా ఇచ్చారు. పార్టీకి చెప్పే తాము లొంగిపోయమన్నారు.

## ఐ బొమ్మ రవి కేసు.. ఈడీ ఎంట్రీ...

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 22:



తెలుగు సినిమా పరిశ్రమకు భారీ నష్టాలు కలిగించిన ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ కూడా దృష్టి పెట్టింది. పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్టు అనుమానించిన ఈడి, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు లేఖ రాసి, కేసు వివరాలు, ఆర్థిక లావాదేవీల రికార్డులు అందించమని కోరింది. ఇప్పటికే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐబొమ్మ మాస్టర్‌మైండ్ ఇమ్మడి రవి బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3.5 కోట్లకు పైగా డబ్బులు ఫ్రీజ్ చేశారు. విదేశీ బ్యాంకుల నుంచి పెద్ద మొత్తాల్లో రవి NRE ఖాతాకు బదిలీలు, నెలకు రూ.15 లక్షలు క్రిప్టో వాలెట్‌ల నుంచి ట్రాన్స్‌ఫర్‌లు జరగడం తేలడంతో, ఈడి ఈ అంశాలపై విస్తృత దర్యాప్తు చేపట్టనుంది.విశాఖ వాసి ఇమ్మడి రవి ఐబొమ్మ వెబ్‌సైట్ ను ప్రారంభించి తెలుగు సినిమాలతో పాటు ఇతర ప్రాంతీయ చిత్రాలు, OTT ప్లాట్‌ఫారమ్‌ల కంటెంట్‌ను పైరేట్ చేసి అప్‌లోడ్ చేస్తూ వస్తున్నారు. రిలీజ్ రోజే లీక్ చేసేవాడు. ఐబొమ్మతో పాటు 65 మిరర్ సైట్‌లు, Bappam TV వంటి ఎక్స్‌టెన్షన్‌ల ద్వారా రవి వ్యవస్థను నడిపాడు. ఈ సైట్‌లపై అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు లింక్‌లు ఇచ్చి, యూజర్లను డైవర్ట్ చేసి మరింత డబ్బు సంపాదించాడని పోలీసులు ఆరోపిస్తున్నారు. రవి కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో, క్లౌడ్‌ఫ్లేర్ వంటి CDNలు ఉపయోగించి సర్వర్‌లను అమెరికా, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్‌ల మధ్య మార్చుకుని ట్రాక్ అవ్వకుండా ఉంచాడు. భారతీయ పౌరసత్వాన్ని వదిలేసి.. సెయింట్ కిట్స్ పౌరుడైన రవి, ఫ్రాన్స్‌లో నివసిస్తున్నాడు. దుబాయ్, థాయ్‌లాండ్, USA మధ్య తిరుగుతూ ఉండేవాడు. నవంబర్ 14న హైదరాబాద్ కు వచ్చిన రవిని కుకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఐబొమ్మ ద్వారా మొత్తం రూ.20 కోట్లకు పైగా సంపాదించాడు. పోలీసులు 35 బ్యాంక్ ఖాతాలు, మల్టిపుల్ మొబైల్‌లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు, పెన్ డ్రైవ్‌లు, పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే రవి బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3.5 కోట్లకు పైగా ఫ్రీజ్ చేశారు. మొదట్లో రూ.1.6 కోట్లు, తర్వాత మరిన్ని ఖాతాలు ఐడెంటిఫై చేసి మొత్తం రూ.3 కోట్లకు పైగా బ్లాక్ చేశారు. పైరసీ నుంచి వచ్చిన అక్రమ ఆదాయాలను మనీ లాండరింగ్ ద్వారా క్లీన్ చేస్తున్నట్టు అనుమానించిన హైదరాబాద్ పోలీసులు, ఈడీకి సమాచారం ఇచ్చారు. ఈడీ, ఈ కేసు వివరాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ట్రాన్సాక్షన్ రికార్డులు అందించమని సిపి సజ్జనార్‌కు లేఖ రాసింది. దీని ఆధారంగా PMLA కింద దర్యాప్తు ప్రారంభించనున్నారు. పోలీసులు కూడా మనీ లాండరింగ్ అంగిల్ నుంచి కేసును పరిశీలిస్తున్నారు. బ్యాంకులతో సంప్రదించి మరిన్ని రికార్డులు సేకరిస్తున్నారు. దర్యాప్తులో తేలిన కీలక విషయాల్లో, విదేశీ బ్యాంక్ అకౌంట్ల నుంచి రవి NRE ఖాతాకు పెద్ద మొత్తాల్లో నిధులు బదిలీ అయినట్లుగా గుర్తించారు. ఫ్రాన్స్, దుబాయ్, స్విట్జర్లాండ్‌లోని బ్యాంకుల నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసి, పైరసీ ఆదాయాలను క్లియర్ చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్సాక్షన్లు పైరసీ సంపాదనలను డిజిటల్ కరెన్సీల ద్వారా దాచిపెట్టి, తిరిగి లీగల్ చానెల్స్‌కు మార్చినట్టు పోలీసులు గుర్తించారు. ఈ అంశాలపై ఈడి విస్తృత దర్యాప్తు చేయనుంది. రవి పాస్‌పోర్ట్, ఫారిన్ అకౌంట్స్ వివరాలు స్వాధీనం చేసుకుని, ఇంటర్నేషనల్ ఏజెన్సీలతో కోఆర్డినేషన్ చేస్తున్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి వేడుకలు




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మేరా యువ భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి వేడుకలు ఘనంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మేరా యువభారత్ వారి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. స్థానిక ZPBHS హై స్కూల్ వద్ద ముఖ్య అతిథులు RDO రమణారెడ్డి ,CI వెంక రెడ్డి , అధ్యక్షులు NVT G రాజేష్ మేరా భారత్ డిస్టిక్ ఆఫీసర్ సభ్యులు విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఒక భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు, మరియు భారత దేశపు మొదటి ఉప ప్రధానమంత్రి. స్వాతంత్ర్యం తర్వాత, ఆయన 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారు, అందుకే ఆయనను భారతదేశపు ఉక్కు మనిషి అని పిలుస్తారు. ఆయన గుజరాత్‌లో జన్మించారు, ఇంగ్లాండ్‌లో బారిష్టర్ పట్టా పొందారు, మరియు గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు అని అన్నారు. విద్యార్థులు యువత మహనీయులను మరవరాదని వారి ఆశయ సాధనకై ఎప్పుడు ముందుండాలని ఈ సందర్భంగా వారు. జాతీయ సమైక్యత దేశభక్తిని పెంపొందించడం ప్రత్యేకంచి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిది అని అన్నారు. తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్, NSS ప్రోగ్రాం కోఆర్డినేటర్ DR మద్దిలేటి సుధాకర్, ఎం కె నాయక్, వి నరేందర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్‌రాపోలు నిరంజన్ బత్తుల అమర్, తాళ్ల సురేష్, ఆంజనేయులు, వంగూరు వెంకటేశ్వర్లు, బోడిగ వెంకటేష్, కరాటే మాస్టర్ గోపి ప్రసాద్, సంపత్ సైదా వలి ఆది శేఖర్ హరి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ రవీంద్ర భారతి జెడ్పి బాయ్స్ హై స్కూల్ జెడ్పి గర్ల్ హై స్కూల్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ PET లు విద్యార్థులు సిబ్బంది క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## అదనపు నిధులు తీసుకురావడానికి కృషి చేస్తా

✦ మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్

**జయభేరి, ఉప్పల్ :**

రామంతపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను కార్పొరేటర్, ఎమ్మెల్యేతో కలిసి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రారంభించారు. రామంతపూర్ డివిజన్‌లో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సహాయ సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. వీటిలో ముఖ్యంగా ఇంద్రనగర్ కమిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం & రిపేర్లకు రూ. 35 లక్షలు, ఇంద్రనగర్ VMH స్కూల్ లేన్ సీసీ రోడ్ నిర్మాణానికి రూ. 12.50 లక్షలు, ఆర్టీసీ కాలనీ సీసీ రోడ్లు నిర్మాణానికి రూ. 35 లక్షలు, బాలకృష్ణనగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ లైన్ పనులకు రూ. 55 లక్షలు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ మల్కాజ్గిరి నియోజకవర్గానికి అదనపు నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసం అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రతి ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా కార్పొరేటర్లతో కలిసి పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ, డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీకి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో HMWSSB జీఎం సంతోష్ కుమార్, GHMC డీఈ నాగమణి, ఏఈ మౌనిక, స్థానిక ప్రజలు, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తా

✦ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ లో అలాగే APIIC కాలనీ లో 34 లక్ష రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన UGD పనులకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, డీజీఎం సతీష్, AE అలేఖ్య, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు చేపట్టిన డీసీపీలు

✦ రాచకొండ సిపిని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీపీలు

**జయభేరి, మేడ్చల్:**

శనవారం నాడు మహేశ్వరం డీసీపీగా కే. నారాయణ రెడ్డి, మల్కాజిగిరి డీసీపీగా సిహెచ్ శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీపీలు రాచకొండ సిపి సుధీర్ బాబు ని మర్యాద పూర్వకంగా కలిశారు. నారాయణ రెడ్డి యాదాద్రి భువనగిరి డీసీపీగా, శంషాబాద్ డీసీపీగా, వికారాబాద్ తర్వాత మళ్లీ రాచకొండ కమిషనరేట్ మహేశ్వరం డీసీపీగా వచ్చారు. సిహెచ్ శ్రీధర్ ఇంటిలిజెన్స్ నుండి వచ్చారు.

## చలో మహబూబ్ నగర్ దీక్షను జయప్రదం చేయండి

**జయభేరి, దేవరకొండ :**




గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ రాష్ట్ర అధ్యక్షుడు లక్పతి నాయక్ ఈనెల 26న మహబూబ్నగర్‌లో గిరిజన విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న చలో మహబూబ్నగర్ నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, గిరిజన విద్యార్థుల విద్యా అవకాశాల విస్తరణ, మరియు విద్యా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ ఉద్యమం చారిత్రాత్మకం అని వారు పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసన దీక్షలో అందరూ భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరియు వివిధ లంబాడి సంఘ నాయకులు నాయకులు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తు, విద్యా విధానం, మరియు రాజ్యాంగ హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమం అత్యంత కీలకం. అందరూ ఒకే గొంతుతో ఐక్యంగా 26వ తేదీన మహబూబ్నగర్‌కు వెళ్లి మద్దతు తెలపాలి,అని కోరారు. అదేవిధంగా గిరిజన విద్యార్థి సంఘం చేపట్టిన ఈ ఉద్యమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, గిరిజన సంక్షేమ సంఘం తరపున పూర్తి మద్దతును ప్రకటించారు.

కార్యక్రమంలో శ్రీను నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శివ వైన్స్‌పై చర్యలు తీసుకోవాలి

✦ ఎక్సైజ్ సిఐ కి వినతి పత్రం అందించిన బిజెపి నాయకులు

✦ పరకాల పట్టణంలో వైన్స్ షాపులు

✦ విద్యాలయాలకు, దేవాలయాలకు 100 మీటర్లు దూరం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

✦ పర్మిట్ రూములు ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి




**జయభేరి, పరకాల నవంబర్ 22:**

శనివారం భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజులు నిరంజన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ & ప్రొవిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పరకాల పట్టణ గ్రామదేవతలైన కనకదుర్గమ్మ మధన పోచమ్మ దేవాలయం పూర్వం నుండి వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయం పట్టణంలోని అనేక కులాల వారికి ఇలవేల్పుగా ఉన్న దేవాలయం. ఇది అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు, నిత్యం అన్నదానాలు, నిత్య హోమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించే సాంప్రదాయం కలిగిన దేవాలయం ఇది. ఇంతటి ప్రత్యేకత కలిగిన దేవాలయానికి కేవలం 20 మీటర్లు దూరంలో, కేంబ్రిడ్జి పాఠశాలకు 80 మీటర్ లోపల వైన్స్ ఏర్పాటుచేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన శివ వైన్స్ ను అక్కడినుండి దూరంగా తరలించి భక్తుల మనోభావాలను, అదేవిధంగా ఆలయ పవిత్రతను కాపాడాలని ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని, ఇట్టి వైన్స్ లో మద్యం కొనుగోలు చేసిన వినియోగదారులు అట్టి మద్యం సీసాలను గుడి ప్రాంగణంలో తాగుతూ ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారు దయచేసి ఇది శాంతి భద్రతల సమస్యగా తలెత్తడానికి ముందే తగు చర్యలు తీసుకొని ఇట్టి వైన్స్ ఆలయానికి దూరంగా ఏర్పాటు చేయాలని, భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాయకులు కుక్కల విజయ్ కుమార్, దంచనాదుల సత్యనారాయణ, మిడిదొడ్డి నరేష్, నాగెల్లి రంజిత్, దార్న సునీల్, ముత్యాల దేవేందర్, సారంగ నరేష్, సందీప్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ జె టెన్నిస్ మెన్స్ డబుల్ విజేతలు శ్యాంసుందర్ అనిల్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోగల ఎస్ జె టెన్నిస్ అకాడమీ లో నిర్వాహకుల కొప్పుల సందీప్ రెడ్డి జగన్నాథం ఆధ్వర్యంలో శనివారం రోజున డబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్లో 16 మంది క్రీడాకారులు పాల్గొనగా మొదటి విజేతలుగా ఆడెపు శ్యాంసుందర్ నాగిరెడ్డి అనిల్ రెడ్డి రెండో విజేతలుగా రామ్ మనోజ్ చిర్ర శ్రీధర్ రెడ్డిలు నిలిచారు ఈ సందర్భంగా టెన్నిస్ అకాడమీ నిర్వాహకుడు సందీప్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యవంతులుగా ఉండడానికి దోహదపడతాయి అని అన్నాడు ఈ కార్యక్రమంలో టెన్నిస్ క్రీడాకారులు ఎంవి అప్పలచార్యులు రాజారత్నం చంద్రకాంత్ రెడ్డి వెంకన్న హనుమంతరావు మహేష్ రెడ్డి అభిషేక్ సాయి లతోపాటు తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప స్వామి పడిపూజ



**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 22:**

శ్రీశ్రీశ్రీ హరిహర అయ్యప్ప స్వామి 3వ పడిపూజ ఉదయం 9 గంటలకు పుణ్యక్షేత్రం పట్టణమైన యాదగిరిగుట్టలోని గౌడ్ సత్రం ఎదురుగా అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తి పూర్వకంగా నిర్వహిస్తున్నారు. పడిపూజ అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాదం (భిక్ష) ఉంటుంది. అయ్యప్ప స్వాములు, భక్తులు,బంధుమిత్రులు పడిపూజకు హాజరై అన్నప్రసాదం (భిక్ష) స్వీకరించాల్సిందిగా అయ్యప్ప స్వామి భక్తుడు,యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యల్లగొండ కృష్ణ ఆహ్వానం పలికారు.

## తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ

✦ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ ఎం .రజిత

**జయభేరి, రాజన్న సిరిసిల్ల:**

శనివారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత. తెలంగాణ డయాగ్న స్టికె సెంటర్ ను, తంగళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేశారు తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లలో నిర్వహించే రక్త నమోనా పరీక్షలను, రిజిస్టర్ ను పరిశీలించి సరియైన రిపోర్టులు అందించి ప్రజల వ్యాధులను అరికట్టులలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించి, చిన్నపిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించి పిల్లలకు సకాలంలో టీకాలు తీసుకొని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప చేయవలసిందిగా మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ తొ పాటు వైద్య సిబ్బందికి సూచించారు

## కార్మిక హక్కులను హరించే 4లేబర్ కోడ్ల అమలకు వెంటనే రద్దు చేయాలి

**జయభేరి, పరవాడ:**




కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లను నోటిపై చేయడాని నిరసిస్తూ శనివారం పరవాడ ఫార్మా సిటీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. లేబర్ కోడ్లను నోటిఫై చేయడాని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన లేబర్ కోడ్ల ఉత్తర్వులు లంకెలపాలెం జంక్షన్ లో దగ్ధం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. మరోసారి తేటతెల్లమైందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం 4 లేబర్ కోడ్లను తెచ్చింది. బీహార్ ఎన్నికల అనంతరం నోటిఫై చేయడం ద్వారా బిజెపి ప్రభుత్వం కుట్టిలత్వాన్ని బయట పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దుకు భవిష్యత్తు పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ, నాయకులు టీ మల్లేశ్వరరావు, కర్ణం వెంకట్రావు, వెంకట స్వామి, దేవ కిషోర్, లక్ష్మణరావు, రాము, రమేష్, ఈశ్వరరావు, నాగరాజు, అశోక్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యున్ని పరామర్శించిన ఆర్టిఐ కమిషనర్



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 22:**

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు చిలివేరు రవి ఇటీవల హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎరుకల వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బానోతు బిచ్చు నాయక్, జర్నలిస్టులు పత్తిపాటి రమణాకర్, కర్రే రాజ్ కుమార్ ,ఆరే నరసింహులు, మాన్నె చంద్రమౌళి, కోట సురేష్, భూక్య రమేష్ నాయక్, రాగుల శ్రీను పాల్గొన్నారు.



## స్వామి వారిని సన్నిధిలో..

✦ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 22:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారంగా ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధానాలయంలోని స్వయంభు మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ డీఈవో దోర్బల భాస్కర్ శర్మ స్వామి వారి లడ్డు ప్రసాదం పాటు చిత్ర పటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా మనవరాలికి అన్నప్రాసన జరిపించి మొక్కులు చెల్లించుకోవడానికి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్రాచార్యులు, అర్చకులు వినయ్, ఏఈఓ గజవెల్లి రఘు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, ఏఎస్ఐ మాణిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణ

✦ గిరిప్రదక్షిణ కరపత్రాలు ఆవిష్కరించిన ఆలయ ఈవో వెంకట్రావు



**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 22:**

వచ్చే నెల 1వ తేదీన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం కొండ చుట్టూ అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణ జరగనుందని యాదగిరిగుట్ట అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. శనివారం యాదాద్రి కొండపైన గిరిప్రదక్షిణకు సంబంధించిన కరపత్రాలను యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు ఆవిష్కరించారు. డిసెంబర్ 1వ తేదీన తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు గిరిప్రదక్షిణ జరగనుందని, ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు అయ్యప్పస్వాములకు గర్భాలయ దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వాములందరూ గిరిప్రదక్షిణలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ యల్లగొండ కృష్ణ, సుడుగు శ్రీనివాస్ రెడ్డి, అనిల్, ర్యాకల రాజు, పాండు, బాలు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు



**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 22:**

అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఎస్సై తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన పార్వతి లాలి స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్ పై అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద స్పెండర్ ప్లస్ మోటార్ సైకిల్ ను ఆపి తనిఖీ చేయగా ఒక కవర్లో సుమారుగా 100 గ్రాముల గంజాయి దొరికిందని అన్నారు. సదర్ వ్యక్తి గంజాయిని ఉప్పల్ నుండి కొమరవెల్లికి అమ్మడం కోసం తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి 100 గ్రాముల గంజాయి, స్పెండర్ ప్లస్ మోటార్ సైకిల్ ,ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ఈ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ అక్షాన్స్ యాదవ్, యాదగిరిగుట్ట ఏసిపి శ్రీనివాస్ నాయుడు, పర్యవేక్షణలో ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గౌరవ సలహాదారులను శాలువ, మెమంటోతో సన్మానం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నూతన పద్మశాలి సంఘం, పద్మశాలి యువజన సంఘం, పద్మశాలి మహిళా సంఘం ప్రమాణ స్వీకారం సందర్భంగా గౌరవ సలహాదారులను శాలువ, మెమంటోతో సత్కరించినారు. ఈ సందర్భంగా సలహాదారు అంకం చంద్రమౌళి మాట్లాడుతూ నూతనముగా ఎన్నిక కాబడిన పద్మశాలి వివిధ సంఘాల వారు ఐకమత్యంతో ముందుకు నడచి పద్మశాలి యువతకు మార్గదర్శిగా వ్యవహరించి వారి అభ్యున్నతి పాటుపడాలని కోరినారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి అన్ని సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

# బీఎస్పీ పార్టీలో 10 కుటుంబాలు చేరిక

✦ ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ఆదివాసులను నిరంతరం మోసం చేస్తున్న కాంగ్రెస్ టిఆర్ఎస్ లను వచ్చే ఎన్నికల్లో ఓడించండి

✦ సమాజంలో సర్వసమానత్వం నెలకల్పాడంకోసం, బహుజన బిడ్డల భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి రావాలి

✦ బీఎస్పీ అధికారంలోకి వచ్చినప్పుడే భద్రాచలం నియోజకవర్గం ఆదివాసుల అభివృద్ధి సాధ్యం.




**జయభేరి, చర్ల, నవంబర్ 22 :**

చర్ల మండల కేంద్రంలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో చర్ల మండలంలోని ఉప్పరిగూడెం పంచాయతీ లోని మల్లారం గ్రామస్తులైన పది కుటుంబాలకు చెందిన మహిళలు బహుజన్ సమాజ్ పార్టీలో పార్టీ మండల నాయకుడు సోయం శ్రీమూర్తులు కృషి ద్వారా మండల అధ్యక్షుడు పడగల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాయిన్ అవడం జరిగింది బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలంభద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ మల్లారం గ్రామ మహిళలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది ఈ సందర్భంగా సందర్భంగా కొండా చరణ్ మాట్లాడుతూ ఇంతమంది మహిళలు బహుజన సమాజ్ పార్టీలో చేరడం పార్టీ అభివృద్ధికి ఎంతో శుభ పరిణామం అని అన్నారు.

ఉక్కు మహిళా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహన్జి శ్రీ కుమారి మాయావతి గారి స్ఫూర్తితో మహిళలు బహుజన రాజకీయాల్లో శక్తివంతంగా పాల్గొనాలనీ కోరారు సమాజంలో సర్వసమానత్వం నెలకల్పాడంకోసం, భారత భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి రావాలి బహుజన్ సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం భారత సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను రూపుమాపడం కోసం బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనారిటీ ప్రజలు, ఓసి లోని సమానత్వ, మానవతావాదులు ఐక్యం అవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆదివాసీలను నిరంతరం మోసం చేస్తున్న కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఆదివాసి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు వద్దిపేట చెక్ డ్యామ్ నిర్మిస్తామని పోడు భూములకు పట్టాలు ఇచ్చి కేసులు కొట్టేస్తామని నాడు అన్నారని నేటి వరకు కూడా పూర్తిస్థాయిలో ఆ పని జరగలేదని గుర్తు చేశారు. నిధులు మంజూరు చేయకుండా పంచాయతీ వ్యవస్థను నాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని ప్రజలు గుర్తించాలని అన్నారు ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్‌నీ ప్రజలు రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓడించాలనీ కోరారు బీసీ ఎస్సీ ఎస్టీలు ఐక్యతతో బహుజన రాజ్యాన్ని చర్ల మండలంసాధించుకోవాలి పిలుపునిచ్చారు భద్రాచలం గడ్డపై ఏనుగుని గెలిపించి బిఎస్పీ నీలి జెండాని ఎగరేయాలనీ అన్నారు. అగ్రవర్ణ ఆదిపత్య కుల భావాజాలం కల కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీలతో భారత రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం ఉన్నదని భారత రాజ్యాంగం సంపూర్ణంగా అమలు జరిగినప్పుడే బీసీ ఎస్సీ, ఎస్టీ మత మైనారిటీ లైన బహుజనుల అభివృద్ధి సాధ్యం అని భారత రాజ్యాంగ రక్షణ కోసం భారత రాజ్యాంగ సంపూర్ణ అమలు కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ బీఎస్పీ మాత్రమే అని బీఎస్పీ అధికారంలోకి రావడం ద్వారానే భద్రాచల నియోజకవర్గం, ఆదివాసుల అభివృద్ధి సాధ్యపడుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, మండల కోశాధికారి ఎస్కే జహీరుద్దీన్ భాష, పార్టీ సీనియర్ నాయకులు కొండా కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# 50 రూపాయలకు ధర పెంచేందుకు అనుమతివ్వాలి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరి కొండపైన కొబ్బరికాయను 50రూపాయలకు అమ్ముకునేలా తమకు అనుమతించాలని కొండపైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వర్తక వెల్ఫేర్ సంఘం సభ్యులు శనివారం ఆలయ ఈవో వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్తక వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు గడ్డమీది మాధవులు గౌడ్ మాట్లాడుతూ.. కొండపైన 40 రూపాయలకు కొబ్బరికాయలు అమ్మడం వల్ల గిట్టుబాటు కాదని,తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య గుర్తించి కొబ్బరికాయను 40రూపాయలు కాకుండా 50రూపాయలకు అమ్ముకునే విధంగా తమకు అనుమతించాలని ఆలయ ఈవో కు ప్రత్యేకంగా అభ్యర్థించారు. తమకు వర్తక సంఘానికి కొండపైన కేటాయించిన దుకాణాలలో మూడు దుకాణాలు ద్వారా కొబ్బరికాయలు అమ్ముతామని అన్నారు. ఈ దుకాణాల ద్వారా సుమారు 50 మంది కుటుంబ సభ్యులు జీవనోపాధి పొందుతున్నాయని వివరించారు. మూడు దుకాణాల ద్వారా దేవస్థానం వారికి కిరాయి ప్రతినెల రూ.4.లక్షలు రూపాయలు చెల్లిస్తున్నారు. వర్తక సంఘం ద్వారా మొత్తం ప్రతి నెల కిరాయి 14 లక్షల 16 వేల రూపాయలు చెల్లించడం జరుగుతుంది. అందువల్ల 40 రూపాయలకు కొబ్బరికాయను అమ్మడం వల్ల తమ కుటుంబాలు ఇటు అద్దె చెల్లించలేక,అటు జీవనోపాధిని పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. 50 రూపాయలు కొబ్బరికాయలను అమ్ముకొవడానికి అనుమతి ఇచ్చేందుకు తగిన విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈవోకు వినతిపత్రం అందజేసిన వారిలో వర్తక సంఘం అధ్యక్షులు గడ్డమీది మాధవులు, గౌరవ అధ్యక్షులు కొన్నే రమేష్, గౌరవ సలహా దారులు వెంకటేష్,ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు,కోశాధికారి నరసింహ,ఉపాధ్యక్షులు గడ్డమీది రాజు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 22:**

కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య నియామకమయ్యారు. శనివారం జాతీయ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన జాబితాలో బీర్ల అయిలయ్యను యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్,ఆలేరు శాసన సభ్యులు ఉన్న బీర్ల అయిలయ్యకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి రావడంతో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని,యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సామాన్యుడిలా ప్రతీ కార్యకర్తకు,ప్రజలందరికీ అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న నన్ను పార్టీ గుర్తించి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడి పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. సామాన్య కార్యకర్తకు సైతం మంచి పదవులు కేవలం కాంగ్రెస్ పార్టీలోనే వస్తాయని, పార్టీ,ప్రజల కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు ఉన్నత పదవులు వచ్చేలా చూస్తానని బీర్ల అయిలయ్య తెలిపారు.

# ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టపోనత్సావాలు

✦ ఉత్సవాల్లో పాల్గొన్న నేతలు

**జయభేరి, మేడ్చల్:**




మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో గల పురాతన పోచమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట పోత్సావాలు రెండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు.

మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కాగా రెండవ రోజు హోమాలు, విగ్రహ మూర్తులకు అభిషేకాలు, విగ్రహాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అత్వెల్లి లో విగ్రహ ప్రతిష్టపోత్సావాల్లో అన్ని పార్టీల నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి అమ్మవారి విగ్రహాలకు అభిషేకాలు చేశారు.

అమ్మవారి ఆలయం కోసం రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ అధక్షుడు హరివర్ధన్రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ తమ పార్టీల నేతల కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనీయర్ నాయకుడు వి.హనుమంత్ రావు ఆలయంను సందర్శించి ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో అన్ని పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## వివాదంలో యాంకర్ శివజ్యోతి

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 22:**



యాంకర్ శివ జ్యోతి... ఈ పేరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తెలంగాణ యాసలో తనదైన స్టైల్‌లో తీన్మార్ సావిత్రిగా ఈమె చెప్పిన వార్తలతోనే ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. బిత్తిరి సత్తితో ఈమె చెప్పే ముచ్చట్లకు బుల్లి తెర ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఆ క్రేజ్ తో బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత కొన్ని షోలకు యాంకరింగ్ చేసినా ప్రస్తుతం స్పెషల్ ఈవెంట్స్ చేస్తున్నారు. అప్పుడప్పుడూ కొన్ని టీవీ షోల్లోనూ మెరుస్తున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శివజ్యోతి... తాజాగా ఓ వివాదంలో చిక్కుకున్నారు. తిరుపతి శ్రీవారి దర్శనం క్యూ లైన్‌లో ఇచ్చే అన్న ప్రసాదంపై శివ జ్యోతి చేసిన కామెంట్స్ వీడియో వైరల్ అవుతోంది. టీటీడీ క్యూ లైన్లో ఉన్నప్పుడు ఈ వీడియో రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తన ఫ్రెండ్ సోను అక్కడ భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రసాదాన్ని తీసుకుంటుండగా... 'సోను కాస్ట్ లీ ప్రసాదం అడుక్కుంటున్నాడు ఫ్రెండ్స్.' అంటూ నవ్వుతూ కామెంట్స్ చేసింది. 'జీవితంలో ఎప్పుడూ అడుక్కోలేదు. ఫస్ట్ టైం అడుక్కున్నా.' అంటూ ఆమె ఫ్రెండ్ కామెంట్ చేశాడు. 'తిరుపతిలో రిచ్చెస్ట్ బిచ్చగాళ్లం' అంటూ నవ్వింది. 'అడుక్కున్నా కానీ... బాగుంది గాయ్స్.' అంటూ శివజ్యోతి ఫ్రెండ్ అన్నాడు.ప్రసాదంపై శివజ్యోతి నవ్వుతూ చేసిన కామెంట్స్ వీడియో వైరల్ అవుతుండగా... శ్రీవారి భక్తులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి అన్న ప్రసాదాన్ని, భక్తులను అవమానించిందని అంటున్నారు. 'ఇది ఆమె నిజ స్వరూపాన్ని చూపిస్తుంది. యాత్రికులను బిచ్చగాళ్లతో పోల్చింది. ప్రసాదం అడుగుతున్న తమను తాము కుబేరులతో పోల్చుకుంటున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిందనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. కర్మ సరైన టైంలో ఆమెకు బుద్ధి చెబుతుంది.' అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేయగా... 'ఈమెను టెంపుల్‌లోకి రాకుండా బ్యాన్ చేయాలి. టీటీడీ చర్యలు తీసుకోవాలి.' అంటూ ఏకిపారేస్తున్నారు. మరి దీనిపై శివజ్యోతి ఎలా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంది.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**జయభేరి, పరకాల, నవంబర్ 22:**

పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల కేంద్రంలో ఇటీవీలే వివిధ కారణాలతో మృతి చెందిన జన్ను కాంతమ్మ, అన్వరి బేగం, బూర నరేష్, వడ్డేపల్లి మహాలక్ష్మి, పాలకాల లక్ష్మీ, దోణపాటి విజయ శివాజీ రెడ్డి, పానకాని అనూష, గట్టు మొగిలి, బొచ్చు రాజయ్య,నాగెల్లి ఆనందం, తనుగుల ప్రభాకర్ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి చేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుల మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని ఆర్థిక సహాయం అందచేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ‘అఖండ 2 తాండవం’పై భారీ హైప్ ..
## బాలకృష్ణ కెరీర్‌లో రికార్డ్ స్థాయి డీల్

నటసింహం నందమూరి బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే మాస్ ఆడియన్స్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది.. ఈ కాంబోలో వచ్చిన సింహా, లెజెండ్ తర్వాత వచ్చిన అఖండ ఎంత పెద్ద బ్లాక్‌బస్టర్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో వస్తున్న సీక్వెల్ ‘అఖండ 2 తాండవం’ మార్కెట్‌లో సంచలన క్రేజ్‌ను సృష్టిస్తోంది.ఈ సినిమాపై బిజినెస్ సర్కిల్స్‌లో ఎంతటి డిమాండ్ ఉందో చెప్పడానికి ప్రీ రిలీజ్ బిజినెస్ చూస్తే సరిపోతుంది. బాలయ్య కెరీర్‌లో ఇప్పటివరకు ఏ సినిమాకు రాని స్థాయిలో భారీ రేట్లు ఈ సినిమాకు పలికాయి. ట్రేడ్ సర్కిల్స్ సమాచారం ప్రకారం, అఖండ 2 వరల్డ్‌వైడ్ థియేట్రికల్ రైట్స్ 120 కోట్లకు పైగా అమ్ముడయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచే 100 కోట్లకు పైగా బిజినెస్ జరిగినట్టు తెలుస్తుంది. రెస్ట్ ఆఫ్ ఇండియా తో పాటు ఓవర్సీస్‌లో కూడా భారీ డిమాండ్ ఉంది. రైట్స్ మార్కెట్ లో హాట్ కేకుల్లా అమ్ముడవుతుంది. ఇంత భారీ రేటు పలకడానికి ప్రధాన కారణం బాలయ్య-బోయపాటి కాంబినేషన్‌పై ఉన్న అఖండ నమ్మకం, అలాగే ‘అఖండ’ సినిమాతో ఏర్పడిన రికార్డు స్థాయి మాస్ క్రేజ్. బాలకృష్ణ కెరీర్‌లో ఇప్పటి వరకు హయ్యస్ట్ గ్రాస్ చేసిన సినిమా ‘అఖండ’. కరోనా తర్వాత విడుదలై కూడా ₹130 కోట్లు వసూలు చేసింది. ఆ తరువాత వచ్చిన సినిమాలు 100 కోట్ల మార్క్‌ను దాటినా, 150 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ కావడం లేదు. ఇక ‘అఖండ 2’ విషయంలో మాత్రం ట్రేడ్ అనలిస్టులు భారీ అంచనాలతో ఉన్నారు.ప్రీ రిలీజ్ బిజినెస్ 120 కోట్లను దాటడంతో, మూవీ 150 కోట్లు కాకపోయినా, 200 కోట్ల వైపు దూసుకెళ్లే అవకాశం ఉందని ట్రేడ్ టాక్. ‘అఖండ 2 తాండవం’ డిసెంబర్ 5న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. మాస్, ఫ్యామిలీ, యువ ప్రేక్షకులు అందరూ ఎదురు చూస్తున్న సినిమా కావడంతో మొదటి రోజు నుంచే ‘అఖండ’ స్థాయి కలెక్షన్లు వచ్చే అవకాశముందని ట్రేడ్ అంచనా. బాలయ్య-బోయపాటి కాంబినేషన్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద పాత హిస్టరీని రిపీట్ చేస్తుందా? లేక కొత్త హిస్టరీ క్రియేట్ చేస్తుందా? అన్నదానిపై ఇప్పుడు పరిశ్రమ అంతా దృష్టి పెట్టింది.

## అభినందనలే మాకు ఆనందం



ప్రియదర్శి, ఆనంది జంటగా నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ ‘ప్రేమంటే’. ‘Thrill - U - Prapthirasthu’ ఉపశీర్షిక. సుమ కనకాల కీలక పాత్రధారి. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. పుస్కూర్ రామ్మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మాతలు. రానా దగ్గుబాటి సమర్పకుడు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. అ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ ‘మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్. అందరూ సినిమాను అభినందిస్తుంటే ఆనందంగా ఉంది. ఈ క్లీన్ ఎంటర్‌టైనర్‌ని చూడని వారుంటే చూసేయండి’ అని కోరారు. యూత్ మాత్రమే కాక, ఫ్యామిలీ ఆడియన్స్‌కు కూడా సినిమా బాగా నచ్చిందని, డైరెక్టర్ కావాలనుకునే తన కల ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉందని నవనీత్ శ్రీరామ్ అన్నారు. ఇంకా కథానాయిక ఆనంది, నిర్మాత జాన్వీ నారంగ్ కూడా సంతోషం వెలిబుచ్చారు.




## దగ దగా మెరిసిపోతున్న బ్యూటీ..!

ఊహలు గుస గుసలాడే సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన బ్యూటీ రాశి ఖన్నా, అమ్మడు మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా, యూత్‌లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. చాలా సినిమాల్లో ఛాన్స్‌లు రావడంతో, స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఈ ముద్దుగుమ్మ ఊహల గుస గుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, బెంగాల్ టైగర్, శివం, సుప్రీ, హైపర్, జై లవకుశ, రాజా దిగ్రేట్, ఆక్సిజన్, టచ్ చేసి చూడు, తొలి ప్రేమ,ప్రతి రోజూ పండుగే, వెంకీ మామ,వరల్డ్ ఫేమస్ లవ్, తిరు, పక్కా కమర్షియల్ ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక ఈ మధ్య ఈ అమ్మడుకు తెలుగులో కొంత వరకు అవకాశాలు తగ్గాయి. అందువలన కాస్త బ్రేక్ ఇచ్చిన ఈ చిన్నది, సిద్దు జొన్నల గడ్డ సరసన తెలుసు కదా మూవీతో ఎంట్రీ ఇచ్చి తన నటనతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా బంగారపు రంగు చీరలో బంగారంలా మెరిసిపోతూ తన అంద చందాలతో అందరి మనసు దోచేసుకుంటుంది.

## షాకింగ్ విషయం చెప్పిన అందాల భామ

తమిళ్ ఇండస్ట్రీ నుంచి ఎంతో మంది భామలు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎంతో మంది సక్సెస్ కూడా అయ్యారు. వారిలో కీర్తిసురేష్ ఒకరు. 2013లో గీతాంజలి అనే సినిమాతో హీరోయిన్ గా మలయాళీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఫస్ట్ సినిమాతోనే ఉత్తమ మహిళా అరంగేట్రం కథానాయికగా సైమా అవార్డ్ అందుకుంది. 2015 నాటికి కీర్తి తెలుగు, తమిళం, మలయాళం భాషలలో పలు చిత్రాల్లో నటించింది. ముఖ్యంగా తెలుగులో మహానటి సినిమాలో సావిత్రి పాత్రలో ఒదిగిపోయింది. ఈ సినిమాలో తన నటనకు ఉత్తమ నటిగా నేషనల్ అవార్డ్ అందుకుంది. ఈ సినిమా తర్వాత ఆమెకు తెలుగులో మరిన్ని ఆఫర్స్ క్యూ కట్టాయి. తెలుగుతోపాటు హిందీలోకి తెరంగేట్రం చేసింది. కానీ హిందీలో ఆమెకు ఊహించినంత స్థాయిలో సక్సెస్ రాలేదు. 2024 డిసెంబర్ లో తన చిరకాల స్నేహితుడు ఆంటోని థాటిల్ ను వివాహం చేసుకుని వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది. వీరిద్దరి వివాహం గోవాలో మలయాళీ, క్రైస్తవ సంప్రదాయాల్లో జరిగింది. ప్రస్తుతం కీర్తి సురేష్.. విజయ్ దేవరకొండ సరసన రౌడీ జనార్ధన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రివాల్వర్ రీటా అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫుడ్ విషయంలో నాకంటూ కంట్రోల్ ఉండదు. ఏది కావాలంటే అది తింటాను. మనస్ఫూర్తిగా నాకు నచ్చింది తింటానని చెప్పుకొచ్చింది. నేను రోజుకు 10 ఇడ్లీలు , లేదా 10 దోసెలు తింటానని తెలిపింది. ఇష్టంగా తిన్నప్పటికీ నేను వర్కౌట్స్ చేస్తానని చెప్పుకొచ్చింది కీర్తిసురేష్. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.



## అంచనాలు పెంచిన చికిరి



రామ్‌చరణ్ ‘పెద్ది’ నుంచి ఇటీవల విడుదలైన ‘చికిరి చికిరి..’ సాంగ్ ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న సందడి అంతాఇంతా కాదు. ఇన్‌స్టాలో ఈ పాట రీల్స్ చేస్తూ యువతరం చెలరేగిపోతున్నది. ముఖ్యంగా ఈ పాట హిందీ వెర్షన్ పెద్ద హిట్. దాంతో దేశవ్యాప్తంగా ఈ పాట ఓ సంచలనంగా మారింది. నిజానికి ఏ.ఆర్. రెహ్మాన్ నుంచి ఈ స్థాయి విజయం ఈ మధ్య అయితే లేదు. ఊహించని రీతిలో వింటేజ్ రెహ్మాన్ వినిపిస్తున్నాడంటూ శ్రోతలు తెగ సంబరపడిపోతున్నారు. అయితే.. ఈ పాట ‘పెద్ది’ మేకర్స్‌పై పెనుభారాన్నే మోపిందనేది ఫిల్మ్‌వర్గాల మాట. తొలిపాటే ఇంత హిట్ అవ్వడంతో రానున్న పాటలపై కూడా అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దాంతో అటు దర్శకుడు బుచ్చిబాబు సానాకు, ఇటు సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్‌కూ ప్రెషర్ ఎక్కువైందని చెప్పక తప్పదు. ‘పెద్ది’ మార్చిలో రానుంది.

చిత్రీకరణ కూడా 60శాతం పూర్తయింది. మరోవైపు ప్రమోషన్స్‌ని కూడా వేగవంతం చేశారు. ఈ సినిమా నుంచి రెండో సింగిల్‌ని వచ్చే నెల 3వ వారంలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. చిరంజీవి ‘మన శంకరవరప్రసాద్‌గారు’ చిత్రం సంక్రాంతికి విడుదల కానుండటంతో ఆ సినిమా ప్రమోషన్స్‌కి ఇబ్బంది లేకుండా, వారికి అడ్డంకి కాకుండా, జాగ్రత్తగా ప్లాన్ చేసుకొని పాటను విడుదల చేస్తారట. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, ఎడిటింగ్: నవీన్ నూలి, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు. నిర్మాణం: వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**